

ఇక మురుగునీటికి చెక్..

జిల్లా కేంద్రంలో మురికి కూపంగా ఉన్న ఖానాపురం అలుగు, ఇతర వాగులను గోళ్లపాడు చానల్ తరహాలో అభివృద్ధి చేయనున్నారు. 8లో



డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ – మేలో నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం చల్లగా ఉంటుంది. రాత్రి వేళలో పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ఆలయ అర్చకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి పాదానికి, విగ్రహానికి వేదమంత్రాల నడుమ పంచామృతాభిషేకం చేశారు. స్వామివారితో పాటు శ్రీఅలివేలు మంగ, శ్రీ పద్మావతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం జరిపించారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన భక్తులు కల్యాణాన్ని తిలకించి స్వామివారికి మొక్కులు చెల్లించారు. శ్రీ స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్‌మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

జిల్లాలో నేడు భట్టి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్ : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జిల్లాలో ఆదివారం పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 10.15 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. 11.15 గంటలకు వల్లాపురం – గంధసిరి బీటీ రోడ్డు, 11.45 గంటలకు గంధసిరిలో వేణుగోపాలస్వామి ఆలయ రోడ్డుకు, 12.15 గంధసిరి – పెద్దమండవ బీటీ రోడ్డుకు, ఒంటిగంటకు గంధసిరి – బాణాపురం రోడ్డుకు, 1.45కు పెద్దమండవ – మల్లాపురం బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. భోజన విరామం తర్వాత 3.30 గంటలకు వల్లభి – మంగాపురం రోడ్డుకు, 4.30కు వల్లభి – అంజనేయస్వామి దేవాలయం బీటీ రోడ్డుకు, 5.15 గంటలకు మల్లారం-మల్కాపురం, మల్లారం -గంద్రాయి బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం తిరిగి హైదరాబాద్ వెళతారు.

ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్ : ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్ స్థానిక ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రారంభమైంది. తొలిరోజు 800 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోగా అందరూ సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచే విద్యార్థులు బారులుదీరారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు ఎప్‌సెట్ కౌన్సెలింగ్ కో ఆర్డినేటర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బీ.వీ.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్



కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న ఆనంద్‌కుమార్

ఖమ్మంవన్‌టౌన్: కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్ రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ వి.ఆనంద్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

పరస్పర సహకారంతోనే బలోపేతం

ఖమ్మంవ్యవసాయం: మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి సభ్యుల మధ్య పరస్పర సహకారం అవసరమని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శనివారం మత్స్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 218 మత్స్య సహకార సంఘాల్లో సుమారు 16వేల మంది సభ్యులున్నారని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘాల ప్రమోటర్లు ఎం. వెంకటేశ్వర్లు, జె.కృష్ణ, వీరబాబు, శ్రీనివాసరావు, వీరయ్య, ఏడుకొండలు, రామ్మూర్తి, శ్యాంసుందర్, రవికుమార్, రామయ్య, మోహన్ రావు పాల్గొన్నారు.

పని భారం | భద్రత కరువు

రోజుకు 12 నుంచి 14 గంటలు పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులు

- లెక్కకు మాత్రం 8 గంటల డ్యూటీనే..
- ఒత్తిడితో అనారోగ్యం పాలవుతున్న సిబ్బంది
- 'మహాలక్ష్మి'తో పెరిగిన ప్రయాణికులు



ఖమ్మం రీజియన్‌లో వివరాలిలా..

డిపో	బస్సులు: ఆర్టీసీ	బస్సులు: అద్దె	కార్మికులు: కండక్టర్లు	కార్మికులు: డ్రైవర్లు	ప్రతి రోజు నడిపే కి.మీ.
ఖమ్మం	67	67	231	162	57,000
మధిర	33	27	107	73	28,000
సత్తుపల్లి	41	56	152	107	41,200
భద్రాచలం	63	24	139	175	44,200
కొత్తగూడెం	29	32	97	76	26,400
మణుగూరు	31	32	100	102	33,200
ఇల్లెందు	18	00	39	42	8.000

ఖమ్మంమయూరిసెంటర్ : సురక్షిత ప్రయాణానికి మారుపేరైన ఆర్టీసీ నేడు అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే కార్మికులపై మోయలేని భారం పడుతోంది. దీనికి తోడు చాలీచాలని వేతనాలు, అధికారుల వేధింపులు, పాత బస్సులు, డబుల్ డ్యూటీలు, పని ఒత్తిడితో అలసటకు గురవుతున్న కార్మికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో రోడ్డుపై ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి ఎదురవుతోంది. అధికారుల వేధింపులు భరించలేక, సెలవులు దొరకక కార్మికులు కుమిలిపోతున్నారు. కుటుంబ సభ్యులతో గడిపే సమయం కూడా దొరకడం లేదు. ఇక మహిళా కార్మికుల పరిస్థితి మరీ అగమ్యగోచరంగా ఉందని, ఎవరికీ చెప్పుకోలేని మనోవేదన అనుభవిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెరిగిన పని భారంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, తమ ఉద్యోగాలకు భద్రత కరువైందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులపై భారం..

ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోలున్నాయి. ఈ ఏడు డిపోల పరిధిలో ఆర్టీసీ బస్సులు 282, హైర్ బస్సులు 238 ఉండగా, 865 మంది కండక్టర్‌లు, 737 మంది డ్రైవర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. రీజియన్‌లో నిత్యం 2.38లక్షల కి.మీ. మేర బస్సులు తిప్పుతున్నారు. గతంలో పల్లె వెలుగు బస్సుల్లో 160 కి.మీ. డ్యూటీ చేస్తే డే ఔట్ (ఒకరోజు), 300 నుంచి 360 కి.మీ. డ్యూటీ చేస్తే స్పెషల్ ఆఫ్(రెండు రోజులు) డ్యూటీగా పరిగణించేవారు. ఇప్పుడు పల్లె వెలుగులో 240 కి.మీ.కు డే ఔట్, 400 కి.మీ.కు స్పెషల్ ఆఫ్‌గా లెక్క కడుతున్నారు. ఇక ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో గతంలో 200 నుంచి 240 కి.మీ.కు డే ఔట్(ఒక రోజు), 400 నుంచి 450 కి.మీ.కు స్పెషల్ ఆఫ్(రెండు రోజులు)గా ఉండగా.. ఇప్పుడు 400 కి.మీ.పైగా డ్యూటీ చేసినా డే ఔట్ కిందే లెక్క కట్టి గంట, రెండు గంటలు ఓటీ ఇస్తున్నారు. అంటే కార్మికులపై ఎంతమేర పని భారం పెరిగిందో తెలుస్తోంది.



బస్సులో టికెట్లు ఇస్తున్న కండక్టర్

అలసిపోతున్న సిబ్బంది..

ఆర్టీసీలో ఉద్యోగ విరమణలే తప్ప కొత్త నియామకాల సంఖ్య తగ్గిపోతోంది. ఉన్నవారితోనే డబుల్ డ్యూటీలు చేయిస్తుండడంతో కార్మికులు అలసిపోతున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు డ్యూటీకి వస్తే సాయంత్రం 6 గంటల వరకు, ఉదయం 7 గంటలకు వస్తే రాత్రి 9 గంటల తర్వాతే డ్యూటీ దిగుతుండడంతో వారికి సరైన విశ్రాంతి, నిద్ర లేక అనారోగ్యాల పాలవుతున్నారు. కార్మికుల సంఖ్య తక్కువగా ఉండడంతో అలసిపోయిన వారిని సైతం అధికారులు బెదిరించి డ్యూటీలు చేయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సెలవు కావాలంటే డబుల్ డ్యూటీ చేయాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. ఇక మహిళా కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని, వారు ఉదయం పిల్లలు నిద్ర లేవకముందే విధులకు వచ్చి, రాత్రి పడుకున్న తర్వాతే ఇంటికి వెళ్తున్నారు. పేరుకు 8 గంటల డ్యూటీ అయినా.. 12 నుంచి 14 గంటలు పని చేయాల్సి వస్తోంది.

ఉచిత ప్రయాణంతో రద్దీ..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహాలక్ష్మి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పిస్తోంది. దీంతో రద్దీ భారీగా పెరిగింది. 60 – 70 మంది ప్రయాణికులు ఎక్కాల్సిన బస్సుల్లో ప్రస్తుతం 100 మంది దాటుతున్నారు. ఈ ఏడాది మే లో 60,90,984 మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా, వీరిలో మహిళలు 35, 47,756 మంది ఉన్నారు. అయితే పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు, కార్మికులు లేకపోవడంతో ఉన్నవారిపైనే భారం పడుతోంది. ఇక మహాలక్ష్మితో రోజువారీగా వచ్చే నగదు తగ్గుతుండడంతో అధికారులు డబ్బుల కోసం కార్మికులపై ఒత్తిడి పెంచుతున్నారు. మహాలక్ష్మి పథకం డబ్బు ప్రభుత్వం నుంచి మంజూరయ్యేవరకు కార్మికుల వేతనాలు, డీజిల్, ఇతర నిర్వహణ ఖర్చులు కూడా వెళ్లే పరిస్థితి లేదని, డబ్బు చెల్లించి టికెట్ తీసుకునే ప్రయాణికుల సంఖ్య పెంచాలని కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఇలా అధికారుల ఒత్తిడి, ప్రయాణికుల రద్దీ మధ్య కార్మికులు నలిగిపోతున్నారు.

కార్మికుల సంక్షేమంపై పట్టింపు లేదు



ఆర్టీసీలో కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది. సంస్థలో ఉద్యోగ విరమణలు తప్ప.. ఖాళీల భర్తీ లేదు. 2011లో చివరిసారి ఆర్టీసీలో ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ జరిగింది. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా బస్సులు, కార్మికుల సంఖ్య లేదు. ఉన్న సిబ్బందిపై పనిభారం పడుతుంది. ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు.

– పాటి అప్పారావు, ఈయూ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి

స్పెషల్ ఆఫ్ డ్యూటీలు తీసేశారు..



ఆర్టీసీలో కార్మికులపై రెండింతల పనిభారం పెరిగింది. గతంలో 200 కిలోమీటర్ల డ్యూటీ చేస్తే స్పెషల్ ఆఫ్ ఇచ్చేవారు. మరుసటి రోజు సెలవు ఉండేది. ఇప్పుడు వాటిని ఎత్తేయడంతో పాటు కిలోమీటర్లు పెంచి కార్మికులపై పని భారం మోపారు. దీంతో కార్మికులు తీవ్ర ఒత్తిడితో అనారోగ్యం బారిన పడుతున్నారు.

– పిట్టల సుధాకర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ సెక్రటరీ

మొక్కలు నాటడంలో ఖమ్మం టాప్

- పండుగలా ప్లాంటేషన్ చేపట్టాలి
- రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణాధికారి ప్రియాంక వర్గీస్

ఖమ్మం సహకారనగర్ : మొక్కలు నాటడంలో ప్రతీసారి రాష్ట్రంలో ఖమ్మం జిల్లానే అగ్రభాగాన ఉంటోందని రాష్ట్ర ఆటవీ ముఖ్య సంరక్షణ అధికారి ప్రియాంక వర్గీస్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వన మహోత్సవంపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో వర్షాలు మొదలవడంతో ప్లాంటేషన్‌ను పండుగలా చేపడుతున్నామని చెప్పారు. జిల్లాకు లక్ష్యంగా నిర్ణయించిన 31.06 లక్షల మొక్కలను వీలైనంత త్వరగా నాటాలని సూచించారు. లక్ష్య సాధన మాత్రమే కాక నాణ్యత పాటించాలన్నారు. గతంలో ఏ ప్రాంతంలో ఏ మొక్క బాగా పెరిగింది, ఎక్కడ ఎలాంటి మొక్కలు నాటాలనే విషయాన్ని పరిశీలించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, యువత, పిల్లలను భాగస్వాములు చేయాలని ఆదేశించారు. సింగరేణి స్థలాల్లో పచ్చదనం పెరిగేలా ప్లాంటేషన్ చేపట్టాలని, ప్రతీ పాఠశాలలో మునగ, నిమ్మ, కరివేపాకు మొక్కలు కచ్చితంగా ఉండాలని అన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో 31.06 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మొక్కలు నాటేందుకు స్థలాల ఎంపిక జాగ్రత్తగా చేయాలని అధికారులకు సూచించారు. వచ్చే మూడేళ్లకు సరిపడేలా ఇప్పుడే కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. డీఎఫ్ఓ సిద్దార్థ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2015 నుంచి గతేడాది వరకు 14.87 కోట్ల మొక్కలు నాటామన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌కు ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈఓ ఎస్. వినోద్, డీపీఓ హరికిషన్, డీఈఓ సోమశేఖర శర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్ కుమార్, అటవీ అభివృద్ధి అధికారి మంజుల, కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ప్రియాంక వర్గీస్, వనజీవి రామయ్య, సిద్ధార్థ విక్రమ్‌సింగ్ తదితరులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రియాంక వర్గీస్ అన్నారు. స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దంపతులు, డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్‌తో కలిసి శనివారం ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కలు మానవాళి మనుగడకు ఎంతో ముఖ్యమన్నారు. పచ్చని ఖమ్మం జిల్లా, పచ్చని తెలంగాణ కోసం అందరం ప్రతిన బూనాలన్నారు. డీఎఫ్ఓ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 31.06 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఎఫ్‌బీఓ వి.సాంబయ్య అటవీ ఉత్పత్తులు, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక ఉపశమనం..

- రెండు నెలల వేతనం విడుదల
- విధుల్లో చేరిన పెద్దాస్పత్రి కార్మికులు



ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఖమ్మంవైద్యవిభాగం : పెండింగ్ వేతనాలు చెల్లించాలని మూడు రోజులుగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు బ్రేక్ పడింది. తాత్కాలిక ఉపశమనంగా రెండు నెలల వేతనం చెల్లిస్తామని ఆస్పత్రి అధికారులు ప్రకటించడంతో అంగీకరించిన కార్మికులు శనివారం మధ్యాహ్నం విధుల్లో చేరారు. కార్మికులు – అధికారుల మధ్య శుక్రవారం వరకు జరిగిన చర్చలు విఫలం కావడంతో శనివారం ఉదయం ఆస్పత్రి ప్రవేశద్వారం వద్ద కార్మికులు బైఠాయించారు. తమకు రావాల్సిన నాలుగు నెలల జీతాలు చెల్లించేవరకు విధుల్లో చేరేది లేదని భీష్మించారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు విష్ణువర్ధన్, రామయ్య ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్, పోలీసు, ఇతర అధికారులతో చర్చలు జరిపారు. అవి సఫలం కాకపోవడంతో మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని షెడ్డులో కార్మికులతో నిరసన తెలిపారు. కాగా, మూడు రోజుల పాటు ఆస్పత్రిలో కార్మికులు విధులకు దూరంగా ఉండడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోగా, కాలువల్లో మురుగునీటితో దుర్గంధం వెదజల్లింది. మరుగుదొడ్లు శుభ్రం చేయకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. ఈ విషయాన్ని ఆస్పత్రి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆస్పత్రిని శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ తమ కార్యాలయ సిబ్బందిని పంపించారు. అయితే వారిని ఆస్పత్రి కార్మికులు అడ్డుకున్నారు. దీంతో భారీగా పోలీసులను మోహరించినా కార్మికులు తమ పట్టు వీడకపోవడంతో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు మరోమారు చర్చలు జరిపారు. ప్రస్తుతం రెండు నెలల జీతం చెల్లిస్తామని, త్వరలో పూర్తిస్థాయిలో చెల్లిస్తామని అధికారులు అంగీకరించడంతో కార్మికులు సమ్మె విరమించారు. కాగా, వైద్య విధాన పరిషత్ ఆధీనంలో ఉన్నప్పుడు ఆస్పత్రిలో 575 బెడ్లకు కాంట్రాక్టర్‌కు చెల్లించేవారు. కానీ డీఎంఈ పరిధిలోకి వెళ్లాక 430 పడకలకే చెల్లిస్తున్నారు. దీంతో సమస్య ఏర్పడింది. ఆస్పత్రి అధికారులు ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లో పరిష్కారం అవుతుందని, ఇకపై ప్రతీ నెల కార్మికులకు వేతనాలు అందుతాయని ఆస్పత్రి అధికారులు స్పష్టం చేస్తున్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్ : జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం తర్వాత శనివారం తొలిసారి డీసీసీ కార్యాలయానికి వచ్చిన ఆయనకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి సహకారంతో ముందుకు సాగుతానన్నారు. రేణుకాచౌదరి సహకారంతో పాలేరును పర్యాటక కేంద్రంగా మార్చేలా కృషి చేస్తానని చెప్పారు. కొత్తగూడెంలో విమానాశ్రయం సమస్య పెండింగ్‌లో ఉందని, ఇటీవల మంత్రి పొంగులేటి ఈ ఫైల్‌పై కదలిక తెచ్చారని, అది పూర్తి చేసేలా కృషిచేస్తానని చెప్పారు. స్పాంజ్ ఐరన్‌తో పాటు మూతపడిన ఇతర పరిశ్రమలు తెరిపించేలా సంబంధిత అధికారులతో చర్చిస్తానని తెలిపారు.

జగ్జీవన్‌కు నివాళి..

బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, మిక్కిలినేని నరేంద్ర, పాలకుర్తి నాగేశ్వరరావు, బొమ్మిడి శ్రీనివాస్ యాదవ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, యడ్లపల్లి సంతోష్, బాణాల లక్ష్మణ్, నరాల నరేష్, షేక్ అబ్బాస్ బేగ్, మూడుముంతల గంగరాజుయాదవ్, ప్రతిభారెడ్డి, సుగుణ, జ్యోతి, ఫజల్, కనకరాజు, పాషా, మహమూద్, బడేమియా పాల్గొన్నారు.

జిల్లాలో నేడు పర్యటన

ఎంపీ రఘురాంరెడ్డి జిల్లాలో ఆదివారం పర్యటిస్తారు. ఉదయం 8 గంటలకు కరుణగిరిలోని ఫోర్త్ ఎంప్లాయిస్ చర్చ్‌ని, 8.30 గంటలకు వీడీఓస్ కాలనీలోని సాయిబాబా మందిరాన్ని సందర్శిస్తారు. ఆ తర్వాత సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యాలయాలకు వెళ్తారు. 11 గంటలకు ఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలోని తన నివాసంలో పార్టీ నాయకులకు, ప్రజలకు అందుబాటులో ఉంటారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్ : ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీ జీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను పలు సబ్జెక్టుల బోధనకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకిరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, పొలిటికల్ సైన్స్, బిజినెస్ అనలిటిక్స్, బీబీఏ, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్లలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆయా సబ్జెక్టుల్లో జనరల్ అభ్యర్థులు 55శాతం మార్కులతో, ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. జిరాక్స్ సర్టిఫికెట్లతో కూడిన దరఖాస్తులను ఈనెల 9వ తేదీ సాయంత్రం 5గంటల వరకు కళాశాలలో అందించాలని, 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

శ్లోకమే శ్వాసగా..



సత్తుపల్లి గీతా జ్ఞాన మందిరంలో శ్లోకాలు పఠిస్తున్న మహిళలు

సండే స్పెషల్

- వంటింట్లో ఉంటూనే.. పఠనంలో నెగ్గారు..
- గీతా శ్లోక పఠనంలో 25 మంది మహిళలకు బంగారు పతకాలు

సత్తుపల్లిటౌన్: అంతా వివాహితులే.. నిత్యం సంసార జీవితంతో బిజీగా గడిపే ఈ మహిళలు ఏడాది కాలంలోనే 700 శ్లోకాలు పఠించారు. అవలీలగా అప్పగించి ఔరా అనిపించారు. ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన భగవద్గీత శ్లోక పఠనంలో పోటీ పడి ఏకంగా బంగారు పతకాలు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు.

పఠించటమే వారి లోకం..

ఒక్క శ్లోకం చెప్పడమే చాలా కష్టంగా ఉంటుంది. అలాంటిది భగవద్గీతలోని 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలను తడబడకుండా పఠించారు. శ్వాసను ఆపుతూ వందల శ్లోకాలను ఏకధాటిగా చెప్పటం అంత సులభం కాదు. అయితేనేం ఈ గృహిణులు శ్లోకాలను అలవోకగా చెబుతూ అబ్బురపర్చుతున్నారు. భక్తిభావాన్ని నరనరానా జీర్ణించుకుని శ్లోకాలను పఠించారు. శ్లోకంలో ఒక భాగం అడిగితే మిగతా శ్లోకాలను అవలీలగా చెప్పడం వీరి ప్రత్యేకత.

టెలీగ్రామ్ యాప్‌తో..

ఆలయాల్లో జరిగే పూజా కార్యక్రమాల్లో ముందుండే సత్తుపల్లికి చెందిన ఈ మహిళలు భగవద్గీత శ్లోకంపై పట్టు సాధించాలని తపించారు. మైసూర్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద స్వామి ఆధ్వర్యంలో దత్తపీఠంతో పాటు గీతా పరివార్, గీతా మకరందం గ్రూప్‌ల సహకారంతో శ్లోకాలు నేర్చుకున్నారు. ఇందుకోసం టెలీగ్రామ్ యాప్‌లో చేరి ఆన్‌లైన్‌లోనే శ్లోకాలను కంఠస్తం చేసే విధానంపై శిక్షణ పొందారు. ఇలా 15 రోజులకోసారి 30 శ్లోకాల చొప్పున చూడకుండా వీడియోకాల్‌లో అప్పగించేవారు. ఇలా 700 శ్లోకాలను ఎక్కడ అడిగినా, ఏ పాదం అడిగినా తడబడకుండా చెబుతూ ప్రపంచ వ్యాప్త శ్లోకపఠన పోటీల్లో నెగ్గి శభాష్ అనిపించుకున్నారు. ఇటీవల మైసూర్ దత్తపీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామిజీ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్లు అందుకున్నారు. ఖమ్మం, సత్తుపల్లిలోని ఆలయ కమిటీలు శ్లోక పఠనం గోల్డ్‌మెడల్ విజేతలను సత్కరించడంతో పాటు అభినందన కార్యక్రమాలు నిర్వహించాయి.

చాలా ఆనందంగా ఉంది



కుటుంబ సభ్యుల సహకారంతో భగవద్గీత శ్లోక పఠనం నేర్చుకున్నా. ఇంటి పని చూసుకుంటూనే శ్లోకాలను ఆన్‌లైన్‌లో నేర్చుకున్నా. ఎంతో మందితో పోటీ పడి నెగ్గడం ఆనందంగా ఉంది. స్వామిజీ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ తీసుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నా.

– అద్దంకి అశ్విని, సత్తుపల్లి


ఎక్కువ సమయం కేటాయించా



భక్తితో భగవద్గీత శ్లోకాలను నేర్చుకున్నాం. చాలా ఇష్టంగా ఎక్కువ సమయం కేటాయించా. మైసూర్ దత్తపీఠం వారి ఆధ్వర్యాన ఈ శ్లోకాలను పఠించడం, ఫైనల్ పరీక్షల్లో కూడా విజయం సాధించడం చెప్పలేని ఆనందాన్ని కలిగించింది.

– వేముల శ్యామల, సత్తుపల్లి

ఏడాది కాలంలోనే..



గీతా పరివార్ గ్రూప్‌లో చేరి భగవద్గీత శ్లోకాలను ఆన్‌లైన్‌లో నేర్చుకున్నా. ఏడాదితోనే 700 శ్లోకాలను కంఠస్తం చేసి అప్పగించానంటే నాకే ఆశ్చర్యం కలిగింది. గతంలో అవార్డు సాధించిన భార్గవి స్ఫూర్తితో పఠనం చేసి విజయం సాధించా.

– టి.వాసంతి, బెంగళూరు

చాలా సంతోషంగా ఉంది



గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉంది. బాల్యంలో చదివినట్టుగానే పోటీపడి నేర్చుకున్నాను. 32 నిమిషాల్లో 156 గీతాశ్లోకాలు అప్పగించడం ద్వారా విజయం సాధించి గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ సాధించా. స్వామీజీ చేతుల మీదుగా అందుకోవడం మర్చిపోలేని అనుభూతి.

– కంభంపాటి ఉమాదేవి, సత్తుపల్లి

క్లుప్తంగా

మంత్రి తుమ్మలను కలిసిన డీసీహెచ్ఎస్



రాజశేఖర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ఆస్పత్రుల పర్యవేక్షక అధికారి (డీసీహెచ్ఎస్)గా నియమితులైన డాక్టర్ కేసగాని రాజశేఖర్‌గౌడ్ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల.. డాక్టర్ రాజశేఖర్‌గౌడ్‌ను సత్కరించారు.

సెంట్రల్ ఆర్మ్‌డ్ అసిస్టెంట్ కమాండోగా మండలవాసి



ఖుషీల్‌వంశీ

తిరుమలాయపాలెం: సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫలితాల్లో ఆల్ ఇండియా 71వ ర్యాంక్ సాధించి అసిస్టెంట్ కమాండోగా మండలంలోని కాకరవాయికి చెందిన కొత్తపల్లి ఖుషీల్‌వంశీ ఎంపికయ్యాడు. ఆయన తల్లిదండ్రులు కొత్తపల్లి శివకుమార్, రేణుక. సివిల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఖుషిల్ తెలిపాడు. పేద కుటుంబంలో పుట్టి ఉన్నత ఉద్యోగం సాధించిన ఖుషిల్ వంశీని గ్రామస్తులు అభినందించారు.

ఇక మురుగునీటికి చెక్..

- రూ.249 కోట్లతో అమృత-2 పథకంలో అండర్ డ్రెయిన్ నిర్మాణం
- టెండర్ల ప్రక్రియ పూర్తి.. పనులు మొదలు పెట్టడమే తరువాయి
- మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి 20 ఎకరాల భూమి కోసం ప్రతిపాదనలు



అండర్ డ్రెయిన్ నిర్మించనున్న ఖానాపురం అలుగువాగు..

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలో మురికి కూపంగా ఉన్న ఖానాపురం అలుగువాగుతో పాటు అనుబంధంగా ఉన్న వాగులను గోళ్లపాడు చానల్ తరహాలోనే అభివృద్ధి చేయనున్నారు. అమృత పథకం-2లో రూ.249 కోట్లు కేటాయించగా టెండర్లు సైతం పూర్తయ్యాయి. ఇక పనులు మొదలు పెట్టడమే తరువాయి. ఈ పథకం గత ఏడాది మంజూరైనప్పటికీ వరుస ఎన్నికలు ఉండటంతో నిర్మాణంలో జాప్యం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. మూడు నెలల కిందట టెండర్లు పూర్తి కాగా వరంగల్‌కు చెందిన సంస్థ ఈ పనిని దక్కించుకుంది. పనుల్లో భాగంగా మురుగునీరు శుద్ధి చేసే యూనిట్ల ఏర్పాటు కోసం రెండు చోట్ల సుమారుగా 20 ఎకరాలకు పైగా భూమి అవసరం ఉంటుందని అధికారులు ప్రతిపాదనలు పంపారు. నగరంలోని సుమారు 20 డివిజన్ల పరిధిలోని 1 నుంచి (8వ డివిజన్ మినహా) 15వ డివిజన్ వరకు, సమీపంలోని మరో 5 డివిజన్ల పరిధిలో మురుగునీరు పోయేందుకు అండర్ డ్రెయిన్ నిర్మించనున్నారు. ఈ డివిజన్ల పరిధిలో మురుగు నీరు నాలాల ద్వారా వెళ్లే క్రమంలో వాగులో కలుస్తోంది. అయితే, వాగులో మురుగునీరు కలవకుండా అండర్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం మురుగునీరంతా నగరంలోని గొల్లగూడెం (వెలుగుమట్ల), ధంసలాపురం పెద్ద చెరువుల్లోకి చేరుతుండటంతో అక్కడి నీరు కలుషితమవుతోంది. ఇటీవల ధంసలాపురం చెరువులో నీరు కలుషితం కావడంతో పెద్ద మొత్తంలో చేపలు మృతి చెందాయి. మత్స్యకారులు సైతం తమను ఆదుకోవాలని ఆందోళన చేశారు. మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రులు, అధికారులను కలిసి వినతిపత్రం అందించారు. కాగా, అండర్ డ్రెయిన్ ద్వారా తరలించే నీరు చెరువుల్లో చేరడానికి ముందే శుద్ధి చేస్తారు. అందుకు గొల్లగూడెం, ధంసలాపురం చెరువుల వద్ద నీటి శుద్ధి యూనిట్లను ఏర్పాటు చేసి, శుద్ధి అయిన నీరు ఆయా చెరువుల్లోకి వదిలేలా ఏర్పాట్లు చేయనున్నారు.

టెండర్లు పూర్తయ్యాయి

అమృత పథకంలో అండర్ డ్రెయిన్ నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. నిర్మాణ పనులు మొదలు పెట్టాల్సి ఉంది. మురుగునీరు చెరువుల్లో కలిసే దగ్గర శుద్ధి యూనిట్ల ఏర్పాటుకు భూమి అవసరం ఉంది. భూసేకరణకు ప్రతిపాదనలు పంపాం. భూమి సేకరించాక ప్లాంట్ల నిర్మాణం జరుగుతుంది. ముందుగా అండర్ డ్రెయిన్ పనులు ప్రారంభిస్తాం.

– రంజిత్, ఎస్ఈ, ఖమ్మం కార్పొరేషన్

అండర్ డ్రెయిన్ తొమ్మిది కిలోమీటర్లు...

అండర్ డ్రెయిన్ నిర్మాణంతో అనేక కాలనీలకు మురుగునీటితో పడుతున్న ఇబ్బందులు తప్పనున్నాయి. అండర్ డ్రెయిన్ పైపులైన్ నిర్మాణం ఖానాపురం ఊర చెరువు నుంచి 9 కిలో మీటర్ల మేర నిర్మించనున్నారు. ఖానాపురం, ప్రశాంతినగర్, చైతన్యనగర్, వరదయ్యనగర్, కవిరాజ్‌నగర్ ద్వారా ధంసలాపురం, గొల్లగూడెం చెరువుల వరకు నిర్మించనున్నారు. కాగా, అండర్ డ్రెయిన్ నిర్మాణానికి ధంసలాపురం పెద్ద చెరువు వద్ద 16 ఎకరాలు, గొల్లగూడెం చెరువు వద్ద 3.5 ఎకరాలు అవసరం ఉందని గుర్తించిన ఇంజనీరింగ్ అధికారులు భూసేకరణ కోసం ప్రతిపాదనలు పంపారు.



అండర్ డ్రెయిన్ ప్రతిపాదిత మ్యాప్ (ఫైల్)

డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ – మేలో నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు శనివారం సాయంత్రం రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి విడుదల చేశారు. పరీక్షలకు 46,130 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో 23,114 మంది విద్యార్థులు ఉత్తీర్ణత (50.10శాతం) సాధించారని పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి తెలిపారు. బాలురు 22,355 మంది పరీక్షలకు హాజరుకాగా 8,465 మంది, బాలికలు 23,784 మంది పరీక్షలు రాయగా అందులో 14,649 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11,809 మంది విద్యార్థులకు గాను 6,352 మంది ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు..

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసిన నేపథ్యంలో విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రీవాల్యుయేషన్‌కు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

ఫోన్ ధర చెల్లించండి



ఖమ్మంలీగల్: డబ్బులు పెట్టి ఆన్‌లైన్‌లో ఫోన్ కొంటే ఫోన్ చార్జర్ మాత్రమే వచ్చింది. దీంతో ఫిర్యాదుదారునికి నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత తీర్పునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరానికి చెందిన మహబూబ్‌అలీ 2022లో రెడ్ మీ సెల్‌ఫోన్‌ను ఆన్‌లైన్‌లో రూ.18,298 చెల్లించి బుక్ చేసుకున్నాడు. సెల్‌ఫోన్ బాక్స్ రాగా దానిని ఓపెన్ చేయగా చార్జర్, పౌచ్ మాత్రమే ఉండటంతో ఫిర్యాదుదారుడు ఆన్‌లైన్ కంపెనీకి ఫోన్ చేయగా వారి నుంచి సరైన స్పందన రాకపోవడంతో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌కు నివేదించారు. ఈ కేసును పరిశీలించిన కమిషన్ కంపెనీ నిర్లక్ష్యం ఉందని నిర్ధారించి ఫిర్యాదుదారుడికి ఫోన్ డబ్బులు రూ.18,298, నష్టపరిహారం కింద రూ.10,000, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ.10,000 చెల్లించాలని తీర్పునిచ్చారు.

‘సాక్షి’ సిబ్బందికి వైద్య పరీక్షలు



సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల గ్రామంలో ఉన్న సాక్షి దినపత్రిక కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి హైదరాబాద్ మలక్‌పేట యశోద, ఖమ్మం శరత్ మాక్సి విజన్ ఆస్పత్రుల సౌజన్యంతో వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని సాక్షి యూనిట్ మేనేజర్ మోహన్‌కృష్ణ ప్రారంభించి మాట్లాడారు. నిత్యం పని ఒత్తిడిలో ఉంటున్న సిబ్బంది కోసం యాజమాన్యం ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం యశోద ఆస్పత్రి వైద్యులు జాన్‌బాబు, డాక్టర్ ప్రతిభ సారథ్యంలో గుండె సంబంధిత వ్యాధులకు ఈసీజీ, 2–డీ ఎకో పరీక్షలతోపాటు కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలు అవసరమైన వారికి రిఫర్ చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సాక్షి ప్రొడక్షన్ మేనేజర్ నవీన్, సర్క్యులేషన్ మేనేజర్ ప్రదీప్, సాక్షి టీవీ కరస్పాండెంట్ మహేందర్, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు శ్రీనివాసాచారి, రాంబాబు, కిరణ్, జగన్, కృష్ణారెడ్డి, సతీశ్, రాజు, శరత్ మాక్స్ విజన్ సిబ్బంది విక్రమ్‌సింగ్, దేవేందర్, యశోద ఆస్పత్రి సిబ్బంది శ్రీధర్, దుర్గ, మమతతోపాటు సబ్‌ఎడిటర్లు, ప్రొడక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యుడు, పక్కన సాక్షి బీఎం మోహన్‌కృష్ణ తదితరులు

తల్లీ, కూతురికి పాముకాటు

నేలకొండపల్లి: తల్లీ, కూతురును పాము కరిచిన ఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని సుర్దేపల్లి గ్రామానికి చెందిన మారపొంగు రాధ(27), ఆమె కూతురు దీవెన (5) శుక్రవారం రాత్రి ఇంట్లోని వరండాలో నేలపై నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో కట్ల పాము తొలుత కూతురు దీవెనను కరవగా ఆమే ఏడ్చింది. దీంతో నిద్ర లేచిన తల్లిని కూడా పాము కరవడంతో చుట్టు పక్కల వారు వచ్చి పామును చంపారు. తల్లి, కూతురును నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పాప పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మణ్‌రావు (ఫైల్)

మధిరరూరల్: భార్యతో జరిగిన ఘర్షణతో మనస్తాపానికి గురైన భర్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మధిర మండలం రాయపట్నంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కోట లక్ష్మణ్‌రావు (45)కు గీతతో కొంత కాలం కింద వివాహమైంది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. తర్వాత కుటుంబ కలహాల నేపథ్యంలో వారు విడిపోయారు. ఆ తర్వాత రాయపట్నానికి చెందిన సుజాత అలియాస్ బుల్లిని లక్ష్మణ్‌రావు రెండో పెళ్లి చేసుకున్నాడు. వారి మధ్య మనస్పర్ధలు రావడంతో కొంతకాలం వేర్వేరుగా ఉన్నారు. నెలరోజులుగా దంపతులిద్దరూ కలిసి ఉంటున్నారు. శుక్రవారం రాత్రి వారి మధ్య వాగ్వాదం తలెత్తింది. మనస్తాపానికి గురైన లక్ష్మణ్‌రావు ఉరేసుకున్నాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ నేతలు

ఖమ్మం స్పోర్ట్స్ : రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల, మహిళల పవర్ లిఫ్టింగ్ పోటీలు ఖమ్మంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను దక్షిణ భారత పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రమేష్ గౌడ్, జోసేఫ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు ఉన్నారని, వీరిని మరింత అభివృద్ధి చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలు ఆదివారం కూడా కొనసాగనున్నాయి. ఇక్కడ సత్తా చాటిన వారిని జాతీయ పోటీలకు ఎంపిక చేస్తారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ నాయకులు అఫ్జల్ హసన్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్.మనోజ్‌కుమార్, సుజిత్‌కుమార్, రమేష్ బాబు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కూసుమంచి: మండలంలోని తురకగూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును దుండగులు చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కుల లింగయ్య, అతని భార్య పార్వతమ్మ రోజూలాగే తమ ఇంట్లో నిద్రిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున పార్వతమ్మ నిద్రలేవగా ఆమె మెడలోని గొలుసు కనిపించకపోవడంతో పాటు నుదుట రక్త గాయం కనపడింది. పార్వతమ్మ భర్త కదల్లేని స్థితిలో ఉండటంతో దుండగులు ఆమెపై దాడి చేసి గొలుసు ఎత్తుకెళ్లి ఉంటారని భావిస్తున్నారు. తనకు ఏం గుర్తు లేదని, ఏం జరిగిందో తెలియడం లేదని పార్వతమ్మ చెపుతుండగా ఆమెపై మత్తు మందు ప్రయోగించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోరీకి గురైన గొలుసు విలువ రూ.2.5 లక్షలు ఉంటుందని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాల బస్సు పల్టీ..

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల చెరువుకట్టపై నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు శనివారం అదుపుతప్పి చెరువులో పల్టీ కొట్టింది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం నగరం బల్లేపల్లికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు పిల్లలను ఎక్కించుకునేందుకు వేపకుంట్ల మీదుగా చింతగుర్తి గ్రామానికి వెళ్తుండగా చెరువు కట్ట వద్ద ఎదురుగా వచ్చిన మరో వాహనాన్ని తప్పించబోయి చెరువులోకి పల్టీ కొట్టింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్లీనర్ ఆంగోతు వీరబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. పిల్లలు లేక పోవడంతో పెనుప్రమాదం తప్పింది.

ప్రొద్దుటూరులో పోలీసుల గాలింపు

పోలీసుల రాకను గుర్తించి పరారైన నిందితుడు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన రైతు బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో నిందితుల కోసం ఖమ్మంఅర్బన్ పోలీసులు గాలిస్తున్నారు. మొత్తం 13 మందిపై కేసు నమోదు చేయగా శుక్రవారం ఎనిమిది మందిని అరెస్ట్ చేసి కోర్టుకు పంపించారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. ఈ క్రమంలో కేసులో ఏ-3 గా ఉన్న చింతకాని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య తన ఇంట్లో ఉన్నాడనే సమాచారం మేరకు ఖానాపురంహవేలి పోలీసులు అరెస్ట్ చేసేందుకు శనివారం ప్రొద్దుటూరుకు రాగా, గమనించిన పుల్లయ్య ఇంటి గోడ దూకి పరారైనట్లు తెలిసింది. పోలీసులు మాత్రం వారి కోసం గాలిస్తున్నట్లు చెబుతున్నారు.

గంజాయి పట్టివేత

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లి శివారు కోతులగుట్ట వద్ద అక్రమంగా తరలిస్తున్న 7.113 కిలోల గంజాయిని రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. సీఐ రాజిరెడ్డి వివరాలు వెల్లడించారు. ఒడిశా నుంచి రెండు ద్విచక్రవాహనాలపై హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు కోతులగుట్ట వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 7.113 కిలోల గంజాయి, రెండు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.1.75 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. పట్టుబడినవారిలో ఖమ్మం నెహ్రూనగర్‌కు చెందిన దొంతుల సాయిరాఘవేంద్ర, హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన పోలోజు శరత్‌చంద్ర, ఆలేటి శివ, గొంగిడి నిశాంత్, కోట కృపాకర్ ఉన్నారని, వారిపై కేసు నమోదు చేశామని సీఐ రాజిరెడ్డి వివరించారు.